వివాదాస్పదంగా నాలా పక్కన నిర్మాణం

- బఫర్‌జోన్ అంటూ రెవెన్యూ అధికారులు అభ్యంతరం
- కోర్టు ఆదేశాలు ఉన్నాయని నిర్మాణదారుల వాదన

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): నాలా పక్కనే జరుగుతున్న నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నాలా బఫర్ జోన్‌లో నిర్మాణాలు వద్దంటూ రెవెన్యూ అధికారులు అభ్యంతరం చెప్పగా, నిర్మాణదారులు మాత్రం కోర్టు ఆదేశాలున్నాయని చెప్పడం ఉద్రిక్తతకు దారి తీసింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.11 అంబేడ్కర్‌నగర్ బస్తీకి ఆనుకొని నాలా వెళ్తుంది. బస్తీకి, నాలాకు మధ్య కొంత ఖాళీ స్థలం ఉంది. సుమారు 400 గజాల వరకు ఉన్న ఈ స్థలం తమదేనంటూ కొంత మంది చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు శనివారం ప్రయత్నాలు ఆరంభించారు.


రేకులు వేసేందుకు సిద్ధం చేసిన కర్రలు

నాలా స్థలంలో నిర్మాణాలు ఎలా చేస్తారంటూ స్థానికులు ప్రశ్నించారు. కానీ వారు పట్టించుకోలేదు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. నిర్మాణాలు బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయని ప్రాథమిక అంచనాకు వచ్చారు. వెంటనే నిర్మాణాలు ఆపాలని సూచించారు. అయినా, నిర్మాణదారులు వినిపించుకోలేదు. నిర్మాణంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు తలదూర్చవద్దని తమకు కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొనడంతో బంజారాహిల్స్ పోలీసులు రంగంలోకి దిగి బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు బఫర్‌జోన్ ఉందా? లేదా? అనేది తేల్చాలని పోలీసులు సూచించారు. సర్వేయర్ అందుబాటులో లేడని సోమవారం సర్వే చేసి బఫర్ జోన్ ఎంత వరకు వస్తుందనే విషయం తేలుస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అప్పటి వరకు నిర్మాణాలు చేపట్టవద్దని పోలీసులు చెప్పారు. ఇదిలా ఉండగా, బఫర్ జోన్‌లో ఉంటే మాత్రం ఎటువంటి నిర్మాణాలు చేయకుండా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు. అవసరమైతే కోర్టుకు కూడా వెళ్లనున్నట్టు తెలిపారు. దాదాపు నాలుగు గంటలపాటు ఉద్రిక్తత కొనసాగింది. చివరకు సోమవారం వరకు రెండువర్గాలు సమన్వయం పాటించాలని పోలీసులు సూచించడంతో నిర్మాణాలు ఆపేశారు.

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని కళింగ కల్చరల్‌హాల్లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను మిసెస్ ఇండియా దివా-2025 విజేత ప్రియాంక సందూరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పనిబృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు.


వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న నటి ప్రియాంక సందూరి


ఇళయరాజా సుందరేశన్‌కు స్వాగతం పలుకుతున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అమీర్‌పేటకు ఇళయరాజా సుందరేశన్ బైక్ యాత్ర

అమీర్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ చెన్నై రోటరీ క్లబ్ ప్రతినిధి ఇళయరాజా సుందరేశన్ ప్రారంభించిన బైక్ యాత్ర శనివారం అమీర్‌పేటకు చేరింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు సుందరేశన్‌కు స్వాగతం పలికారు. 16 రోజులపాటు 8వేల కిలోమీటర్లు ప్రయాణిస్తారని రోటరీ క్లబ్ డీజీఎన్డీ హరిహరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి, హైదరాబాద్ నార్త్ అధ్యక్షుడు బి.ఆర్.వి.సుశీలమార్, కార్యదర్శి వెంకట్, మురళి పాల్గొన్నారు.

నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టిన ట్యాంకర్

- కుడి చేతికి తీవ్ర గాయం.. ఆస్పత్రికి తరలింపు

అమీర్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న దినసరి కూలీని వేగంగా వెనక నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో అతడి కుడిచేయికి తీవ్ర గాయమైంది. ఈ సంఘటన శనివారం ఉదయం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి మెట్రో పిల్లర్ నెంబర్.932 వద్ద జరిగింది. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా రేగిడి మండల కేంద్రానికి చెందిన సూరయ్య(60) బతుకుదెరువు కోసం 9 సంవత్సరాల కిందట నగరానికి వచ్చి బీకేగూడ సంజయ్‌గాంధీనగర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని ప్రధానరోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఎర్రగడ్డ నుంచి ఎస్ఆర్‌నగర్ వైపు వెళ్తున్న వాటర్ ట్యాంకర్ వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో సూరయ్య కుడి చేయి నుజ్జునుజ్జయింది. ఇది గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి చేరుకునేలోపే డ్రైవర్ ట్యాంకర్ దూకి పరారయ్యాడు. వెంటనే 108కు సమాచారం ఇచ్చి గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.


గాయపడిన సూరయ్య

ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం దోపిడీకి యత్నం

బోరబండ, మే 10 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ ప్రాంతంలోని ఐసీఐసీఐ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంలో దోపిడీ యత్నం జరిగింది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీఎంలోని క్యాష్ డిపాజిట్ యంత్రాన్ని పగలగొట్టి అందులోని నగదును అపహరించేందుకు ముసుగు ధరించిన ఒక వ్యక్తి పలుమార్లు ప్రయత్నిస్తున్నట్లు పుణెలోని సీఎంఎస్ మానిటరింగ్ టీమ్ ద్వారా ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ఎండీ వసీం అక్రంకు శుక్రవారం అర్ధరాత్రి సమాచారం వచ్చింది. దీంతో ఆయన బ్యాంక్‌కు చేరువలో నివాసం ఉంటున్న ఉద్యోగులు తలారి నాగరాజు, కె.సాయితేజకు సమాచారం ఇచ్చారు. ఏటీఎం వద్దకు వెళ్లాలని సూచించారు. తెల్లవారుజామున 3.22 గంటలకు బ్యాంక్ ఏటీఎం వద్దకు చేరుకున్న ఉద్యోగులకు అక్కడ ఎవరూ కనిపించలేదు. అయితే ఏటీఎం వద్దకు 3.40 గంటలకు చేరుకున్న ఆగంతకుడు 4.05 గంటల వరకూ ఏటీఎం క్యాష్ డిపాజిట్ యంత్రాన్ని పగలగొట్టేందుకు ప్రయత్నించినట్లు మేనేజర్ వసీం అక్రంకు మానిటరింగ్ టీమ్ నుంచి మరోసారి సమాచారం వచ్చింది. దీంతో కాన్ఫరెన్స్ కాల్ ద్వారా పోలీసులతో మేనేజర్ మాట్లాడారు. పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని నిందితుడిని గుర్తించారు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అభరణాలు చోరీ.. పనిమనిషిపై అనుమానం

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణం చోరీకి గురైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12కు చెందిన ఉదయస్విని ఇంట్లో ఇద్దరు పనిచేస్తున్నారు. తరుచూ ఇంట్లో కొంత మొత్తంలో డబ్బులు కనిపించకుండా పోతున్నాయి. ఉదయస్వినికి చెందిన వజ్రంతో కూడిన బంగారు గాజు కనిపించలేదు. ఇటీవల ఆమె అత్త బంగారు గాజు కూడా కనిపించకుండా పోయింది. రెండు రోజుల తర్వాత అత్త బంగారు గాజు టిష్యూ పేపర్‌లో చుట్టేసి ఓ మూలన పడేసి ఉండడం గుర్తించారు. ఈ చోరీలు ఇంట్లో పనిచేస్తున్న వారి పనే అయి ఉంటుందని అనుమానించారు. ఉదయస్విని తన డ్రెస్సులో రూ.600 పెట్టి వాటిని ఉతికేందుకు ఎన్‌బీటీనగర్‌కు చెందిన నిర్మలకు ఇచ్చింది. మరుసటి రోజు ఆ డబ్బు కనిపించలేదు. దీంతో బాధితురాలు తన గాజు చోరీ గురించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిర్మలపై అనుమానం ఉందని పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డెలివరీ బాయ్‌పై హోటల్ సిబ్బంది దాడి

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆర్డర్‌ను తీసుకెళ్లేందుకు వచ్చిన డెలివరీ బాయ్‌పై హోటల్ సిబ్బంది దాడి చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2 ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన నివసించే ప్రభాత్ కుమార్ జొమాటో డెలివరీ బాయ్. ఈనెల 9న అతడికి పంచెకట్టు దోశ హోటల్‌కు సంబంధించి ఆర్డర్ వచ్చింది. ఆహారాన్ని తీసుకెళ్లేందుకు హోటల్‌లోని సెల్లార్‌కు చేరుకున్నాడు. అక్కడ ఉన్న కోడ్ చెప్పాడు. ఆర్డర్ కన్‌ఫాం చేయాలని హోటల్ సిబ్బంది కోరారు. ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో ప్రభాత్ అదే విషయాన్ని చెప్పారు. సిబ్బంది, ప్రభాత్ మధ్య వాగ్వాదం జరిగింది. అంతే హోటల్‌కు చెందిన ఐదుగురు సిబ్బంది అతడిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారత్ సైనికులకు మద్దతుగా ర్యాలీ


భారత సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): దుష్టశక్తులన్నీ కలిసి వచ్చినా భారత్‌ను ఏం చేయలేవని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అన్నారు. యుద్ధం నేపథ్యంలో భారత సైనికులకు సంఘీభావంగా బిల్డర్‌లు శనివారం మాదాపూర్ కార్యాలయం నుంచి హైటెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా భారత్ అనుకూల నినాదాలు చేశారు. జవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాక్‌తో యుద్ధం చేస్తున్న సైనికులకు భారతీయులంతా మద్దతుగా నిలుస్తున్నారన్నారు. తన విధిగా ప్రతీ రోజు తన సంపాదన నుంచి రూ.150 భారత సైనికుల కోసం వెచ్చించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ వి.సురేందర్, నగర ఉపాధ్యక్షుడు డీవీఎస్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు ఎస్ఎన్‌రెడ్డి, శ్రీనయ్య, సచ్చిదానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మురళీనాయక్ కుటుంబానికి పూర్వ అధ్యక్షుడు శ్రీనయ్య రూ.లక్ష విరాళం ప్రకటించారు.

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికి చర్య

బేగంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి పిరికి చర్య అని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అన్నారు. శనివారం బేగంపేట మయూరిమార్గ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు సంఘీభావంగానూ, రక్షణ దళాలకు మద్దతుగానూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మయూరిమార్గ్‌లో జరిగిన ర్యాలీలో కార్పొరేటర్ మహేశ్వరి

బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

అమీర్‌పేట, మే, 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ ఉమేష్‌చంద్ర విగ్రహం నుంచి బాపునగర్ మీదుగా వేంకటేశ్వరస్వామి టెంపుల్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం మీదుగా అమీర్‌పేటలోని భగత్‌సింగ్ విగ్రహం వరకు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ మాట్లాడుతూ భారత సైన్యం చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, శ్రీశైలంగౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పవన్‌కుమార్, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మాజీ కార్పొరేటర్ కృష్ణయాదవ్ తదితరులు

మురళీనాయక్‌కు అశ్రునివాళులు

ఖైరతాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ ఎం.మురళీనాయక్ చిత్రపటానికి ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ జి.కృష్ణయాదవ్, కాంగ్రెస్ నాయకులు రాజుయాదవ్, బీఆర్ఎస్ నాయకుడు గజ్జెల ఆనంద్, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, కమిటీ ప్రతినిధులు వీణామాధురి, బాల్‌కుమార్, నడికుడి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ రక్షణ నిధికి విరాళం ఇవ్వాలి

పంజాగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వివిధ సంఘాలు మద్దతు ప్రకటించాయి. జాతీయ రక్షణ నిధికి సంఘటిత, అసంఘటిత కార్మికులు ఒక రోజు వేతనం ఇవ్వాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన సమరయోధుల వేదిక, ప్రజా సంఘాల జేఏసీ, తదితర సంస్థల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక అధ్యక్షుడు గంట సత్యనారాయణరెడ్డి, జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద్‌రావు, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. పహల్గాంలో అమాయక హిందువులపై దాడి చేసి పలువురిని పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను తుది ముట్టించడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సత్యదేవ్‌వర్మ, పి.రామన్న, మేజర్ చంద్రకాంత్, వినోద్ కుమార్, సుధాకర్, సూర్యనాయక్, నీరజ్ పాల్గొన్నారు.


మురళీనాయక్ మృతికి సంతాపం తెలుపుతున్న తెలంగాణ సాధన సమరయోధుల వేదిక, వివిధ సంఘాల నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మానసిక సమస్యల నియంత్రణలో సైకాలజిస్టులు కీలకం

బేగంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యల నియంత్రణలో సైకాలజిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బేగంపేటలోని కత్రియా హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటరత్నం మాట్లాడుతూ అంతర్జాలమాయలో పడి మానవ సంబంధాలు మరిచిపోతున్నారని తెలిపారు. తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం.రాంచందర్ మాట్లాడుతూ సైకాలజిస్టుల అభివృద్ధే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందన్నారు. కార్యకమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డా.హరిణి, క్లినికల్ సైకాలజిస్ట్ డా.శిల్ప, సుధాకర్, రాజు ఆచార్య, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పంజాగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. శనివారం మధురానగర్‌లోని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదురుగా ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.యాదగిరి, జి.భిక్షపతి,రోజా, సుశీల, శ్యామల, లక్ష్మి, ఆదిలక్ష్మి, సునీత, సోమలక్ష్మి పాల్గొన్నారు.

నేడు టీడీపీ నాయకుల సమావేశం

కేపీహెచ్‌బీకాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేపీహెచ్‌బీ నాయకుల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు కేపీహెచ్‌బీలోని మూడో ఫేజ్‌లో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నాయకురాలు ఉప్పల పద్మాచౌదరి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

బీసీ కులాల్లో అత్యధిక నష్టం మున్నూరుకాపులకే

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్

పంజాగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల్లో అత్యధికంగా నష్టపోయింది మున్నూరుకాపులే అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా ఉన్న మున్నూరుకాపులను కులగణనలో ఐదో స్థానంలో ఉంచారని అన్నారు. గతంలో జరిగిన కులగణన సర్వేలో అత్యధికంగా ఉన్న తమ జనాభాను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన సర్వేలో మూడు శాతం ఉన్నట్లు లెక్కలు చూపారని ఆరోపించారు. అనంతరం గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో ఆగస్టు 30, 31వ తేదీల్లో జరిగే మహాసభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో తెలంగాణ మున్నూరుకాపు సంఘం గ్రేటర్ అధ్యక్షుడు ఆర్వీ మహేందర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు రజినీకాంత్, సంఘం రాష్ట్ర నాయకులు ఉదయ్, రాజారాం, వల్లాల ప్రసాద్‌రావు, ఆది కోటేశ్వర్‌రావు, యాదగిరి, బి.రాజేశ్, బొమ్మ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు

భాగస్వామ్య డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం

- కోర్టు ఆదేశాల మేరకు ఆరుగురిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య డబ్బు తిరిగి ఇవ్వకుండా ఉద్దేశ్యపూర్వకంగా మోసం చేసిన ఆరుగురిపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. టోలిచౌకి సమతా కాలనీకి చెందిన మోసిన్ అలీ వ్యాపారి. 2013లో ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ఆరంభించాడు. ఈ క్రమంలో రఫత్ సుల్తానా అలియాస్ అమెదున్నీసా సుల్తానా గుడిమల్కాపూర్‌లో 800 గజాల స్థలం ఉందని చెప్పింది. స్థలం రఫత్ సుల్తానాది కాగా, నిర్మాణం మోసిన్ అలీ చేసేలా ఒప్పందం కుదిరింది. అడ్వాన్స్‌గా రూ. 10 లక్షలు చెల్లించి రూ.1.30 కోట్లతో తాజ్ కన్వెన్షన్ పేరిట మోసిన్ నిర్మాణాలు చేపట్టాడు. ఫంక్షన్‌హాల్‌లో డెకరేషన్, తదితర వస్తువులను రూ.75 లక్షలకు కొనుగోలు చేసి రఫత్ సుల్తానా ఇంట్లో భద్రపరిచేవాడు. ఇదిలా ఉండగా, 2020లో రఫత్ అనారోగ్యంతో మరణించింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు అక్బర్, అహ్మద్, అఫ్జల్, ఇక్బాల్ అహ్మద్, షవనా సుల్తానా, నజియా సుల్తానాకు ఆస్తి దక్కింది. అయితే, కొన్నిరోజులు బాగానే ఉన్నప్పటికీ అక్బర్, అహ్మద్, అఫ్జల్ ఎలాగైనా ఫంక్షన్‌హాల్‌ను తమ ఆధీనంలోకి తీసుకోవాలని భావించారు. ఇదే విషయాన్ని మోసిన్‌అలీకి చెప్పారు. ఇందుకు అంగీకరించిన మోసిన్ కోర్టును ఆశ్రయించాడు. ఇదిలా ఉండగా, ఆదర్శ్ ఆటో జీఎం నాగరాజు మధ్యవర్తిగా వ్యవహరించి వివాదాన్ని కొలిక్కి తీసుకువచ్చారు. రూ.1.92 కోట్లు అక్బర్, అహ్మద్, అఫ్జల్, షవనా, నజీయా చెల్లించేలా ఒప్పించారు. వీరు రూ.1.16 కోట్లు చెల్లించారు. మిగతా డబ్బును త్వరలోనే ఇస్తారని నాగరాజు ఒప్పించడంతో మోసిన్ ఫంక్షన్‌హాల్ వదిలేశాడు. రోజులు గడుస్తున్నా డబ్బు తిరిగి రాలేదు. కనీసం స్పందించలేదు. దీంతో అక్బర్, అహ్మద్, అఫ్జల్, షవనా, నజీయా, నాగరాజుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ నాంపల్లి 17వ ఏసీజేఎం కోర్టులో మోసిన్ పిటిషన్ దాఖలు చేశాడు. వాదనలు విన్న కోర్టు ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిలింనగర్ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ 316(2), 318(2), 351(2) రెడ్ విత్ 3, 5 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ట్రాఫిక్ ఆటంకాలు


ఫుట్‌పాత్ వ్యాపారులకు కౌన్సెలింగ్ చేస్తున్న రాహుల్ హెగ్డే, హరిప్రసాద్

బంజారాహిల్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ప్రధానరహదారితోపాటు అంతర్గత దారుల్లో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. ఫిలింనగర్ అపోలో చౌరస్తా, 18 బస్తీల్లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారికి ఆయన ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫుట్‌పాత్‌ల మీద వ్యాపారాలను తొలగించి ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు గల కారణాలను అన్వేషిస్తున్నట్టు చెప్పారు. రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ వ్యాపారుల కారణంగా కొంత ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తేలిందన్నారు. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



జయగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

లక్ష్మీనరసింహ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అడ్డగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్‌లోని జేఎల్ఎస్‌నగర్‌లోని శ్రీ జయగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ జయంతి ఉత్సవాల్లో శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బాలరాజు యాదవ్, మేకల రాము, కనుమల నాగరాజు, కొమరయ్యలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ఆలయంలో పూజలు

బౌద్ధనగర్, మే10(ఆంధ్రజ్యోతి): భారత త్రివిధ దళాలకు మద్దతుగా, వారు సురక్షితంగా ఉండాలని కోరుతూ ఆదివారం నుంచి మంగళవారం వరకు శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయకమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వేణుగోపాలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్‌లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆలయంలో శ్రీసుదర్శన నరసింహస్వామి మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి, సోమవారం మన్యుసూక్త పారాయణం, మంగళవారం సుదర్శన శతక పారాయణంతో పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన భారీ వృక్షం

బౌద్ధనగర్, మే10(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో ఓ భారీ వృక్షం నేల కొరిగింది. శుక్రవారం రాత్రి భారీగా వీచిన గాలులతో పాటు వర్షం కురవటంతో భారీవృక్షం వేళ్ల బయటకు వచ్చి, చెట్టు కరెంట్ తీగలపై పడిపోయింది. స్థానికుల పిర్యాదు చేయటంతో అధికారలుఉ విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. శనివారం ఉదయం జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది కొమ్మలను తొలగించి, చెట్టును నరికివేశారు.



బ్రాహ్మణబస్తీలో పడిపోయిన భారీవృక్షం

నేడు సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

అడ్డగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టలోని శ్రీ రేణుక ఎల్లమ్మ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభోత్సవం చేస్తున్నామని సంఘం అధ్యక్షుడు మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్ వర్కర్లకు న్యాయం చేసే విధంగా తమ సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో సంఘం కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. అధ్యక్షుడిగా మల్లేష్, చైర్మన్‌గా రాము, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు మనోహర్, కోశాధికారి కొండల్‌రావు, సంయుక్త కార్యదర్శులు ప్రభాకర్, నాగరాజులు నియమితులయ్యారు.



సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్

ఫంక్షన్ హాల్ యాజమానిపై కేసు నమోదు

బోయినపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఫంక్షన్ హాల్ బుక్ చేసుకుని అడ్వాన్స్ తిరిగి ఇవ్వమని అడిగిన ఓ మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన ఫంక్షన్ హాల్ యాజమాని పై కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్ఐ గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం ట్యాంక్‌బండ్ ప్రాంతానికి చెందిన రమాదేవి అనే మహిళ గత మార్చి 19న వివాహం ఉందని 16న రూ.2 లక్షల అడ్వాన్స్ చెల్లించి బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంపీరియల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ బుక్ చేసుకున్నది. అయితే అనివార్య కారణాల వల్ల పెళ్ళి వాయిదా పడింది. దీంతో ఆ మహిళ ఫంక్షన్ హాల్ యాజమానిని తాను చెల్లించిన అడ్వాన్స్‌ను తిరిగి చెల్లించమని కోరింది. ఫంక్షన్ హాల్ యాజమాని ఆమెకు అడ్వాన్స్ ఇవ్వకపోగా ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించి, అసభ్యకరంగా మాట్లాడినందుకు బాధితురాలు బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఫంక్షన్ హాల్ యాజమాని కైలాష్ అగర్వాల్ పైన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన గంజాయి స్మగ్లర్స్, స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్

రైల్వేస్టేషన్ సమీపంలో..
2.50 కేజీల గంజాయి పట్టివేత

- **నలుగురు స్మగ్లర్స్ అరెస్టు నాలుగు మొబైల్స్, బైకు స్వాధీనం**

హైదరాబాద్ సిటీ, మే 10(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 2.50 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాన్ని నగరానికి తెచ్చి గుట్టుగా విక్రయిస్తున్న నలుగురు స్మగ్లర్స్‌ను అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశాం. నగరానికి చెందిన నలుగురు యువకులు ఫరీదాఖాన్, ఎండీ సలాం, ఎండీ సల్మాన్, ఆసిస్‌ఖాన్‌లను అరెస్టు చేసి సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



ప్రశాంత్ కుమార్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : తల్లికి కాన్సర్, తను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ అల్వాల్ మంగపురం కాలనీకి చెందిన ప్రశాంత్(48) వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తల్లికి కాన్సర్. తల్లి అనారోగ్యంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన ప్రశాంత్ మనస్థాపం చెంది శనివారం గుండ్లపోచంపల్లి, బొల్లారం రైల్వేస్టేషన్ మార్గమధ్యలో సిద్దిపేట్ నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్లే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తవ్వారు.. వదిలేశారు

- బౌద్ధనగర్‌లో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

బౌద్ధనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలు పడి, కంకర లేచిన రోడ్లతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మత్తులు పేరిట రోడ్లను తవ్వి వదిలివేశారు. బౌద్ధనగర్ నేతాజీ స్కూల్ లేన్‌లో గత సంవత్సరం నవంబరులో రోడ్లును తవ్వి సీవరేజీ, మంచినీటి పైపులైన్ మరమ్మత్తులు చేశారు. ఏడు నెలలు గడుస్తున్న నూతన రోడ్లు నిర్మించకపోవటంతో స్థానికులు కంకరలేచిన రోడ్లుపై వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. చాలామంది వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. స్థానిక కార్పొరేటర్, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ వెనుక వీధిలో సీవరేజీ పైపులైన్ మరమ్మత్తుల పేరిట రోడ్డును తవ్వివేశారు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కౌసర్ మసీదు నుంచి అంబర్‌నగర్ వెళ్లే రోడ్డులో మార్కండేయ ఆలయానికి కూతవేటు దూరంలో రోడ్డు మీద గుంతలు పడ్డాయి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కనీసం తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టకపోవటంతో స్థానికులు, వాహనాదారులు అవస్థలు పడుతున్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లో పలు ఏరియాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అధికారులు, కార్పొరేటర్‌పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతానికి నూతనంగా వచ్చిన జీహెచ్ఎంసీ ఏఈకి ఈ ఏరియా, పనులపై అవగాహన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ సమస్యను పట్టించుకుని నూతన రోడ్లును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బౌద్ధనగర్‌లో తవ్వివేసిన రోడ్లు

నూతన రోడ్డు నిర్మించండి



బౌద్ధనగర్‌లో సీవరేజీ పైపు లైన్ నిర్మాణ పనుల నిమిత్తం ఏడు నెలల క్రితం రోడ్డును తవ్వివేశారు. కంకర తేలిన రోడ్డుపై వెళ్లాలంటే చాలా కష్టం ఉంది. నూతన రోడ్డును నిర్మించాలని పలుమార్లు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన రోడ్డును నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

\- శ్రీనివాస్, బౌద్ధనగర్

ప్రమాదాల బారిన పడుతున్నాం



కంకరతేలి, గుంతలు పడిన రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వచ్చిందంటే గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోతుంది. ఏడునెలల నుంచి రోడ్లును నిర్లక్ష్యంగా వదిలివేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని కొత్తరోడ్డును నిర్మించాలి.

\- లావణ్య, బౌద్ధనగర్

లాడ్జి నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- **ఏసీపీ సుబ్బయ్య**
- **అనుమానిత వ్యక్తులపై జాగ్రత్త**

అడ్డగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య కేంద్రంగా పేరున్న సికింద్రాబాద్‌లో అనుమానిత వ్యక్తులపై లాడ్జి నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ గోపాలపురం డివిజన్ ఏసీపీ సుబ్బయ్య సూచించారు. శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సికింద్రాబాద్ లాడ్జి యజమానులు నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్దసంఖ్యలో లాడ్జిలు ఉన్నాయని, పర్యాటకులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులతో వచ్చేవారు ఆధార్ కార్డు లేదంటే ఇతర ఐడీ కార్డులు తెచ్చుకున్న వారికే లాడ్జి నిర్వాహకులు గదులు ఇవ్వాలని సూచించారు. ప్రతి లాడ్జితో పాటు డార్మెటరీ గదుల్లో సీసీ కెమెరాలు ఉండాలని సూచించారు. లాడ్జిల్లో బస చేసేవారి కదలికల్ని నిర్వాహకులు గమనించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో గోపాలపురం పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, ఎస్సైలు సుదీర్, వేణుగోపాల్, సుబ్బారావులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య

ఒరిగిన భారీ వృక్షం తొలగింపు

బోయినపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డ్‌లోని సిఖ్‌విలేజ్‌లో గల పెద్దమ్మ దేవాలయం ముందు ఉన్న సుమారు 100 సంవత్సరాల చరిత్ర గల భారీ వృక్షం శుక్రవారం అర్ధరాత్రి వచ్చిన గాలివానకు విద్యుత్ తీగలపై ఒరిగిపోగా, విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా ఈ వృక్షం వలన స్థానిక బస్తీ వాసులకు ఎప్పటికైనా ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. నేలకొరిగిన భారీ వృక్షాన్ని తొలగించాలని బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌కు తెలుపగా స్పందించిన ఆయన యుద్ధప్రాతిపదికన విద్యుత్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సుమారు రూ.10 వేలు తన సొంత ఖర్చులతో భారీ వృక్ష కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్దరించేందుకు కృషి చేశారు. తమ వార్డ్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ సమస్యలు పరిష్కారిస్తూ అండగా ఉంటున్నాడని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సిఖ్‌విలేజ్‌లో నేలకు ఒరిగిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బందితో మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్

యోగా, ధ్యానంపై ఉచిత శిక్షణ

మచ్చబొల్లారం, మే 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆనందంగా ఉండవచ్చని యోగా గురువు రంజిత్ గురుజీ తెలిపారు. మచ్చబొల్లారం డివిజన్ సాయి బృందావన్ కాలనీలో పది రోజులుగా నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉచితంగా నిర్వహిస్తున్న యోగా, ధ్యానం శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. ఆదివారం నుంచి 10 రోజుల పాటు రోజరీ హైస్కూల్ వెంకటాపురంలో శ్రీ సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా యోగా క్లాసులు నిర్వహిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9885511552 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్, బంగ్లాదేశ్ మార్కెట్ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ అనంతరం రోడ్డు పనులు చేపట్టాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్ధిక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అరవింద్ కుమార్‌యాదవ్ పర్యటించారు. అరవింద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... బంగ్లాదేశ్ మార్కెట్ వీధి, సిద్ధిక్‌నగర్, సందానివీధిలో డ్రైనేజీ పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా మారడంతో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ రూ.10.50లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యద్ మసూద్, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం

- **కాలనీవాసుల ఆందోళన**

ఉప్పల్, మే 10 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని చెంగిచర్ల వెంకటేశ్వరకాలనీలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాన్ని వెంటనే అడ్డుకోవాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులతో కలిసి వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గోనె శ్రీనివాస్, ఏర్పుల మహేష్‌లు మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న ఈ ఇంటికి ఎలాంటి అనుమతులు లేవని, ఇందులో చర్చి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇళ్ల మధ్యలో ఇరుకు భవనంలో చర్చి నిర్మాణం చేపడితే ప్రార్థనలకు వచ్చేవారితో పాటు, కాలనీవాసులకు కూడా ఇబ్బంది కలుగుతుందని వారు వివరించారు. ఈ విషయమై వినతి పత్రం సమర్పించే సమయంలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ హిందువులను కించపరిచే విధంగా మాట్లాడుతోందని వారు ఆరోపించారు. ఈ భవన నిర్మాణాన్ని అడ్డుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు రాసాల నర్సింగ్ రావు యాదవ్, బజారు కిరణ్ గౌడ్, బజ్జూరి శ్రీనివాస్ గుప్తా, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాన్ని అడ్డుకోవాలని ధర్నా చేస్తున్న కాలనీ వాసులు, బీజేపీ నాయకులు

డబ్ల్యూసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రావణ్

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ క్రిస్టియన్ కౌన్సిల్ (డబ్ల్యూసీసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గండి శ్రావణ్ నియమితులయ్యారు. ఆయనకు శనివారం డబ్ల్యూసీసీ జాతీయ అధ్యక్షుడు రఘుముద్రి పీటర్‌నాయుడు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... క్రైస్తవులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంకితభావంతో కృషిచేయాలని డిమాండ్ చేశారు.

4 నుంచి డిగ్రీ కోర్సులు, ఎంఫార్మసీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షలు, ఎంఫార్మసీ పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు శనివారం ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. బీఏ, బీ కాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను, ఎంఫార్మసీ(పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను జూన్ 4 నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

లక్ష్మీకృష్ణకు జీవితసాఫల్య పురస్కారం

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసురాలు, విశ్వవాణి మ్యూజిక్ అకాడమీ, అన్నమయ్య అమృతవాణి సంస్థల వ్యవస్థాపక కార్యదర్శి ములకలూరి లక్ష్మీకృష్ణకు జీవితసాఫల్య పురస్కారం బహూకరించారు. తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శ్రీకమలాకర చారిటబుల్ ట్రస్టు, కమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ముదిగొండ శివప్రసాద్, సంగీత దర్శకులు ఉదయకుమార్, ఆచార్య టి.గౌరీశంకర్, భారతి, అనంతలక్ష్మి, భారతీకమలాకర్, లలితాపరమేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పెళ్లి కావడం లేదని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లికావడం లేదని ఓ టాటా ఏస్ ఆటో డ్రైవర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగర్ పీఎస్ పరిధిలోని ఉన్నికోట సమీపంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గాంధీనగర్ ఎస్ఐ నర్సింహ, స్థానికుల వివరాల ప్రకారం ఉన్నికోట సమీపంలో ఉండే గోపగోని మీనయ్య, యాదమ్మకు ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు గోపగోని నరేష్(33). ఆడపిల్లల వివాహం కాగా నరేష్ వివాహం కాలేదు. వృత్తిరీత్యా నరేష్ టాటా ఏస్ ఆటో డ్రైవర్. తనకంటే చిన్నవారికి పెళ్లిళ్ల అవుతున్నాయని తనకు కావడం లేదని కొంతకాలంగా కుటుంబసభ్యులతో గొడవపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తల్లిదండ్రులు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 3 మూడు గంటల ప్రాంతంలో భోజనానికి వచ్చిన కుటుంబ సభ్యులకు లోపలి నుంచి గడియపెట్టుకొని కనిపించింది. ఎంతతట్టినా తలుపు తీయలేదు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తలుపు పగలగొట్టి చూడగా నరేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ నరసింహ వచ్చి, క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి మార్చురీకి తరలించారు. పెళ్లికావడం లేదని తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మానసిక సమస్యల నియంత్రణలో సైకాలజిస్ట్‌లు కీలకం

బేగంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యల నియంత్రణలో సైకాలజిస్ట్‌ల పాత్ర కీలకమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బేగంపేటలోని క్షత్రియా హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ సైకాలజిస్ట్‌ల అసోసియేషన్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటరత్నం మాట్లాడుతూ అంతర్జాల మాయలో పడి మానవ సంబంధాలు మరిచిపోతున్నారని తెలిపారు. తెలంగాణ సైకాలజిస్ట్‌ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం.రాంచందర్ మాట్లాడుతూ సైకాలజిస్ట్‌ల అభివృద్ధే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డా.హరిణి, క్లినికల్ సైకాలజిస్ట్ డా.శిల్ప, సుధాకర్, రాజు ఆచార్య, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికి చర్య

బేగంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి పిరికి చర్య అని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అన్నారు. శనివారం బేగంపేట మయూరి మార్గ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు సంఘీభావంగానూ, రక్షణ దళాలకు మద్దతుగానూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మయూరి మార్గ్‌లో జరిగిన ర్యాలీలో కార్పొరేటర్ మహేశ్వరి



తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్‌ను కలిసిన కార్యకర్తలు, నాయకులు

సైనికులకు మద్దతుగా వేడుకలకు దూరం

బోయినపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సరిహద్దుల్లో టెర్రరిజాన్ని అంతం చేయడానికి పూర్తి స్థాయిలో మన సైనికులకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్ అన్నారు. అందుకే తన పుట్టిన రోజు వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి విపత్కర పరిస్థితులోనైనా ప్రజలు సైనికులకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బోర్డు మజీ సభ్యుడు పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తార్నాకలోని ఎర్రకుంట చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

- **డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి**

తార్నాక, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. కొందరు కబ్జాదారులు శనివారం తార్నాకలోని ఎర్రకుంట చెరువు సర్వే నంబర్ 121, 122, 123, 125ల్లో గుడిసెలు వేసేందుకు యత్నించడంతో స్పందించిన డిప్యూటీ మేయర్ ఎర్రకుంట స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎర్రకుంట చెరువులో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గుడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలను అరికట్టేందుకే ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.